


## ఆశాలకు సిఐటియు అభినందనలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన రాజీ లేని పోరాటాలు చేసిన ఆశా వర్కర్లు గ్రాట్యూటీ, 180 రోజుల మెటర్నటీ లీవు, 62 ఏళ్లకు ఉద్యోగవిరమణ పెంపు జిఒ 94ను సాధించుకున్నారని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు చెప్పారు. పోరాటాలతో 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంపు, ఏడాదికి రూ. 5 వేలు చొప్పున గరిష్టంగా రూ.1,50,000 గ్రాట్యూటీ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 94ను విడుదల చేయడం హర్షణీయమని ఒక ప్రకటనలో తెలిపారు.

# మంత్రి ఇలాకాలో 'పవర్ ప్లాంట్' సెగలు

- పాచిపెంట భూముల్లో రాళ్లు పాతిన కంపెనీ
- వెయ్యి ఎకరాల భూమి కోల్పోయే అవకాశం
- లబోదిబో మంటున్న గిరి శిఖర గిరిజనులు

ప్రజాశక్తి -పార్వతీపురం

మన్యం జిల్లాలో అదానీకి కేటాయించిన పంప్డ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. ఈ మేరకు సాలూరు మండలం కురుకుట్టి, కొమరాడ మండలం కారివలస ప్రాంతాల్లో ప్రతిపాదిత పవర్ ప్రాజెక్ట్‌లను నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో పవర్ ప్రాజెక్ట్ లు ఏర్పాటు చేయొద్దని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు. పవర్ ప్రాజెక్టు పనులు కూడా అడ్డుకున్నారు. ప్రజావ్యతిరేకతతో పాటు ఒడిశాలో నెలకొన్న సరిహద్దు వివాదాన్ని దృష్టిలో పెట్టుకొని పవర్ ప్రాజెక్ట్ ప్రతిపాదనలు రద్దు చేసినట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. దీంతో జిల్లాలో గిరిజనులకు పవర్ ప్రాజెక్ట్ ల ముప్పు తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కూడా ఇటీవల ఈ విషయాన్ని ప్రస్తావించారు. వైసిపి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన అదానీ పవర్ ప్రాజెక్ట్‌లను టిడిపి ప్రభుత్వం రద్దు చేసిందని గొప్పగా చెప్పారు. స్థానిక గిరిజనులు వ్యతిరేకించడంతో తమ ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. అయితే ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని గిరిజనులకు మరో రూపంలో పవర్ ప్రాజెక్ట్ ముప్పు పొంచి ఉంది. ఈ ప్రాజెక్టు వల్ల పాచిపెంట మండలంలోని గిరి శిఖర గ్రామాల్లో గిరిజనులు సాగు చేస్తున్న వేలాది ఎకరాల భూములు కోల్పోయే అవకాశం కనిపిస్తోంది. పాడేరు జిల్లా అనంతగిరి మండలంలోని గుమ్మకోట పంచాయతీ గుజ్జెలి గ్రామంలో నవయుగ ఇంజనీరింగ్ కంపెనీకి పంప్డ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు గత ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు అనంతగిరి, అరుకు మండలాలతో పాటు పాచిపెంట మండలం లోని భూములు కూడా కోల్పోయే అవకాశం ఉంది. సుమారు మూడు వేల ఎకరాల భూముల్లో 1400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే పవర్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసేందుకు నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ పనులు ప్రారంభించింది. అయితే ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన బాధిత గిరిజన గ్రామాల గిరిజనులు పెద్ద ఎత్తున దీన్ని వ్యతిరేకిస్తూ పోరాడుతున్నారు. ఆదివాసీ గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రస్తుత ప్రభుత్వం కూడా పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కంపెనీ ప్రతినిధులు పనులు మొదలుపెట్టారు. దీనిలో భాగంగా పాచిపెంట మండలంలోని శతాబ్ది, గొట్టూరు, గర్భిగుడ్డి, తంగలాం, బొర్రా మామిడి, మూటకూడు, చిట్టెలబ గ్రామాల్లో గల భూముల్లో కంపెనీ ప్రతినిధులు సరిహద్దు రాళ్ళు పాతేసి వెళ్లి పోయారు. పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం సేకరించిన భూముల్లో పాచి పెంట మండలానికి చెందిన ఏడు పంచాయతీల పరిధిలో ఉన్న భూములను కూడా స్వాధీనం చేసుకోవడానికి రాళ్ళు పాతినట్లు గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అనంతగిరి, అరుకు మండలాలతో పాటు పాచి పెంట మండలంలోని షెడ్యూల్ గ్రామాల భూముల్లో నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ పంప్డ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం చర్యలు చేపడుతోంది. స్థానిక గిరిజనులు వ్యతిరేకిస్తున్నా కంపెనీ ముందుకెళుతోంది. అయితే పవర్ ప్రాజెక్ట్ సెగ మంత్రి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని పాచిపెంట మండలానికి కూడా తగులుతోంది. దీంతో ఆ గ్రామాల గిరిజనులు ఏమి చేయాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల పాచిపెంట మండలంలోని పవర్ ప్రాజెక్ట్ బాధిత గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి సమస్యల్ని వివరించారు. అనంతగిరిలో ఏర్పాటు చేయనున్న పవర్ ప్రాజెక్ట్ వల్ల తమ గ్రామాలు నిరాశ్రయులయ్యే అవకాశం ఉందని తెలిపారు. నియోజకవర్గంలోని సాలూరు మండలంలో కురుకుట్టి లో ప్రతిపాదించిన అదానీ పవర్ ప్రాజెక్ట్ ని ప్రభుత్వం రద్దు చేసిందని గొప్పగా చెప్పిన మంత్రి సంధ్యారాణి అనంతగిరిలో నిర్మాణంలో ఉన్న నవయుగ పవర్ ప్రాజెక్ట్ గురించి ఏమంటారో వేచి చూడాల్సిందే.



పాచిపెంట మండలం శతాబిలో నిరసన తెలుపుతున్న గిరిజనులు


నవయుగ సంస్థ గిరిజన భూముల్లో ఏర్పాటు చేసిన సర్వే రాయి

# సమాజానికి మార్గదర్శి యువతే : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సమాజాన్ని మంచి మార్గంలో నడిచేలా మార్గనిర్దేశం చేసేది యువతేనని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. లయన్స్ క్లబ్, ఎన్సీసీ, ఎయిడ్స్ నియంత్రణ, కళాశాల యాజమాన్యం సారథ్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవ వేడుకలు కొత్తవలసలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళ వారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. జిల్లాలో బాగా చదివే విద్యార్థులు ఉన్నారని, అందుకే పదో తరగతి, ఇంటర్, డిగ్రీల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నారని కితాబిచ్చారు. నేర్చుకున్న విద్యతో క్రమశిక్షణ, విద్యాప్రమాణాలు, నైపుణ్యం పెరగాలని అన్నారు. అంతేగానీ విలాసలకు అలవాటు పడి యువత మత్తు పదార్థాలు జోలికి వెళ్లరాదని సూచించారు. విద్యార్థులు నేర్చుకున్న విద్యాబుద్ధులతో డ్రగ్స్‌రహిత జిల్లాగా మార్చేందుకు యువత అంబాసిడర్లు కావాలని పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు వంటి ఎందరో మహానుభావులు నమ్ముకున్న సిద్ధాంతం, సమాజం కోసం పనిచేశారని గుర్తుచేశారు. అదేవిధంగా ప్రస్తుతం డిగ్రీ చదివే విద్యార్థులంతా పెడతోవ పట్టకుండా సన్మార్గంలో నడిచేలా సమాజాన్ని దిశా నిర్దేశం చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి, నాటు సారా వంటి మత్తు పదార్థాలను నివారించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, ఇందులో యువత కూడా భాగస్వామ్యమై డ్రగ్స్‌ను, ఎయిడ్స్‌ను నివారించేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణపై పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, జానపద కళాకారుడు దామోదర గణపతిరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.సీతారామ్, లయన్స్ క్లబ్, ఎయిడ్స్ సిపిఎం శైలజ, కళాశాల అధ్యాపకులు, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

# సెల్ టవర్లకు అనువైన ప్రాంతాలను పరిశీలించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో జియో, బిఎస్ఎన్ఎల్ ద్వారా ఏర్పాటు చేయబోయే 4జి సెల్ టవర్లకు గుర్తించిన అనువైన ప్రాంతాలను పునఃపరిశీలించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఛాంబరు నుంచి 4జీ సెల్ టవర్ల సమస్యలపై సబ్ కలెక్టర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, ఎంపిడిఒలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే సెల్ టవర్ల కోసం స్థలాలు గుర్తించిన ప్రదేశాల్లో సిగ్నల్ వ్యవస్థ సరిగా లేనందున, వాటికి ప్రత్యామ్నాయమైన స్థలాలను గుర్తించాలని గత సమావేశంలో ఆదేశించినట్టు తెలిపారు. ఇందుకు అధికారులు బృందంగా ఏర్పడి సెల్ టవర్లకు అనుకూల పరిస్థితిలపై అధ్యయనం చేసి నివేదిక అందించాలని కోరారు. ఈ విషయమై అధికారులు గుర్తించిన అనుకూల ప్రదేశాలతో పాటు టవర్ ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లపై కలెక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల కల్వర్టులు అవసరమని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిపై చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒను ఆదేశించారు. అటవీ ప్రాంతంలో అనుమతులపై ప్రభుత్వంతో మాట్లాడతామన్నారు. ప్రస్తుతం అన్ని పనులు ఇంటర్ నెట్ , ఫోన్ తో ముడిపడి ఉన్న తరుణంలో సెల్ టవర్ల వినియోగం తప్పనిసరి అని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్లు పి.ధర్మ చంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, బిఎస్ఎన్ఎల్, జియో సర్వీస్ ప్రొవైడర్లు, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, సాలూరు, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం ఎంపిడిఒలు, అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 10 క్రీడాంశాల్లో ఎంపిక పోటీలను నిర్వహించినట్లు జిల్లా క్రీడా ప్రాధికారిత అధికారి కె.శ్రీధరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్ బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడాంశాల్లో క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఈ క్రీడా ఎంపికలో సుమారు 240 మంది క్రీడాకారులు (బాలురు 180, బాలికలు 60 మంది) పాల్గొన్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులను జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శాప్ ఆధ్వర్యంలో విశాఖలో జరిగే జోనల్ స్థాయి క్రీడా పోటీలకు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సంస్థ శిక్షకులు, ఎస్‌జిఎఫ్. సెక్రటరీ మురళీకృష్ణ, పిఇటిలు, పిడిలు, సహాయ అధ్యక్షులు ఎం.వాసుదేవరావు నాయుడు, సీతంపేట ఐటిడిఎ క్రీడాధికారి జాకబ్, ఎస్‌జిఎఫ్. ఆర్గనైజింగ్ సెక్రటరీ మురళీధరం, బి. వైకుంఠరావు, ఎస్. మురళీ, సీనియర్ క్రీడాకారులు, 10 క్రీడాంశాల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన లాక్షిత

### రాష్ట్ర స్థాయి ఆర్చరీకి లాక్షిత ఎంపిక

**సీతంపేట :** రాష్ట్ర క్రీడలకు జిల్లాస్థాయి అర్చరీలో హిమరిక లాక్షిత ఎంపికయ్యారు. శాప్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు పార్వతీపురంలో జరిగాయి. ఈ ఎంపిక పోటీల్లో లాక్షిత ఎంపికైంది. సీతంపేట ఎపిటిడబ్ల్యుఆర్ఎస్ బాలికల గురుకుల పాఠశాలలో లాక్షిత పదో తరగతి చదువుతోంది. లాక్షిత ఎంపిక పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ జ్యోతి, డిడి అన్నదొర, ఎపిఒ చినబాబు, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు, స్పోర్ట్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, తదితరులు అభినందించారు.

## 17, 18తేదీల్లో భారీ వర్ష సూచన

**పార్వతీపురం :** ఈనెల 17, 18 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు కొన్ని ప్రాంతాల్లో 17, 18 తేదీల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని ఆయన అన్నారు. భారీ వర్షాలు కురిస్తే తదనుగుణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# అవయవ దానంతో పునర్జన్మ

## అవగాహన పెరిగితేనే మరణాలు తగ్గుముఖం
## నేడు అవయవదాన దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

**మనిషి మరణిస్తే తిరిగి రారని బాధపడతాం. కానీ, మరణిస్తున్న మనిషి 8 మందికి పునర్జీవం పోయవచ్చని వైద్యులు, జీవన్ దాన్ ట్రస్ట్ నిరూపిస్తోంది. ఔను...! నిజమే అవయవ దానం విషయంలో మూఢనమ్మకాలు, అపోహలు వీడితే ఎందరికో పునర్జన్మ ప్రసాదించవచ్చు. గత ఏడాది మన జిల్లాలోని తిరుమల - మెడికవర్ ఆసుపత్రి చేసిన ఇటువంటి ప్రయత్నం విజయవంతమైంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 13న జరుపుకోబోతున్న ప్రపంచ అవయవ దాన దినోత్సం సందర్భంగా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.**

ఒకప్పుడు రక్తదానం చేయడమే గొప్ప. కానీ, నేడు అవయవదానం ఓ మంచి సంప్రదాయంగా మారాల్సిన అవసరం ఉంది. ఇందుకు కారణం లేకపోలేదు. సగటు మనిషి జీవన పోరాటంలో నిత్యం బిజీబిజీగా మారుతున్నారు. కాలంతో పోటీ పడుతున్నారు. ఈనేపథ్యంలో రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయి. ఇటువంటి సందర్భాల్లో స్వల్పగాయాలతో బయటపడిన వారు కొందరైతే, అవిటివారుగా మారినవారు మరికొందరు. మనిషి శరీరభాగాల్లో అత్యంత కీలకమైన, సున్నితమైన కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులు, బ్రెయిన్ వంటివి దెబ్బతినడంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్తున్నవారు ఇంకొందరు. ఇటువంటి సందర్భాల్లో అవయవ మార్పిడి చేస్తే బతికేందుకు అవకాశం ఉన్నా, సమయానికి ఆయా అవయవాలు అందుబాటులో లేక యువ కిశోరాల జీవితం సైతం అర్థాంతరంగానే ముగిసిపోతోంది. చేతికి అందిన కొడుకు లేదా కూతురు మృత్యువాత పడడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్తున్న సందర్భాలు కోకొల్లాలుగా ఉన్నాయి. మరణించినవారి అవయవాలను దానం చేసేందుకు ముందుకు వస్తే ప్రాణాపాయంలో వున్నవారికి పునర్జన్మ కల్పించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

**ఆ ఇద్దరూ మరణించినా జీవిస్తునే ఉన్నారు**

ఔను..! ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన ఆ ఇద్దరూ మరణించినప్పటికీ జీవిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం కొత్తవలసకి చెందిన లంకేన సాయి కుమార్ (21) గత ఏడాది నవంబర్ 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించిన సంగతి విధితమే. విజయనగరంలోని తిరుమల -మెడికవర్ ఆస్పత్రి వైద్యుల సూచనమేరకు తమ కుమారుడి అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు ముందుకొచ్చారు. దీంతో, సాయికుమార్ గుండె, కాలేయం, మూత్ర పిండాలు, ఊపిరితిత్తులను జీవన్‌దాన్ ట్రస్ట్ సభ్యుల సహకారంతో వైద్యులు సేకరించి, నాలుగు అంబులెన్సులు, ఒక కారు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నడుపుతున్న లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ద్వారా విశాఖ ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి విమానంలో చెన్నైకు గ్రీన్ ఛానల్ ద్వారా తరలించారు. గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన బాలిక గండిపల్లి పల్లవి కూడా 2024 నవంబర్ 23న అరకు ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురై తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. బ్రెయిన్ డెడ్ అయినట్టు గుర్తించిన తిరుమల – మెడికవర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ సమయ స్ఫూర్తిని ప్రదర్శిస్తూ కుటుంబ సభ్యుల నుంచి అవయవ దానాన్ని కోరారు. అడిగిందే తడువుగా ఆ చిన్నారి తల్లిదండ్రులు తమ కుమార్తె చనిపోయినా మరో వ్యక్తిని బతికించా లన్న పెద్ద మనసుతో వారు కూడా దానం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు.

**చైతన్యంతోనే మరణాల అదుపు**

ఒకరు మర ణించినా వారి అవయ వాలతో మరో 8మందికి పునర్జీవం పోయవచ్చు. ఏ ఒక్క కారణంతో మనిషి మరణించినా ఆ వ్యక్తి శరీరంలోవున్న ఎనిమిది అవయవాల వరకు ఆపదలోవున్నవారికి ఉపయోగ పడతాయని వైద్యులు చెబుతున్నారు. ఈరకంగా దానం చేసేందుకు ముందుకు వస్తే, వాటిని జీవన్‌దాన్ అనే ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ట్రస్ట్ సహకారంతో అవయవాలను తీసి నిర్ధిష్టమైన కాలపరిమితిలో రోగి వేచివున్న ఆసుపత్రికి తరలిస్తారు. ఇందుకోసం జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా అన్ని ఏర్పాటు చేస్తుందని ఆ ట్రస్ట్ ఛైర్మన్ (విమ్స్ డైరెక్టర్) డాక్టర్ రాంబాబు చెబుతున్నారు. అందుకు తగ్గట్టే గత ఏడాది మన జిల్లాలో అవయవ దానం చేసిన సందర్భాల్లో ఆయన సమయ స్ఫూర్తితో స్పందించారు. ప్రభుత్వం తరపున అనుమతులు ఇవ్వడంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, విశాఖ ఎయిర్‌పోర్టు వరకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎస్‌పి వకుల్ జిందాల్ గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు.

**అపోహలు వీడితే ఎదుటి మనిషిని బతికించొచ్చు**

అవయవదానం పట్ల ప్రజలు అపోహలు, మూఢనమ్మకాలు వీడితే ప్రాణాపాయ స్థితిలోవున్న ఎదుటి వ్యక్తులకు పునర్జీవం పోయవచ్చు. ఈపరిస్థితి నుంచి ఉమ్మడి విజయనగరం జిల్లా ఇప్పుడిప్పుడే బయటపడుతుందని అనిపిస్తోంది. గత ఏడాది బ్రెయిన్‌డెడ్ అయిన ఇద్దరి కుటుంబ సభ్యులు తమ విజ్ఞప్తి మేరకు అవయవదానానికి ముందుకు వచ్చారు. జనంలో ఇంకా చైతన్యం రావాల్సిన అవసరం ఉంది. 2024లో రాష్ట్ర వ్యాప్తంగా 210 మంది నుంచి అవయవ దానం లభించగా 1,148 మంది ప్రాణాలతో బయటపడ్డారు. ఇందులో మన జిల్లాలో ఇద్దరు మాత్రమే ముందుకు వచ్చారు. ఇకపై స్వచ్ఛంద అవయవదానాలకు ముందుకు వస్తారని ఆశిద్దాం.

**డాక్టర్ కె.తిరుమల ప్రసాద్**
**మేనేజింగ్ డైరెక్టర్ తిరుమల - మెడికవర్ ఆసుపత్రి, విజయనగరం**


అవయవ దానం చేసిన సాయికుమార్ (ఫైల్)


పింఛను రద్దయిన వికలాంగురాలు రాధాకుమారి

## రాధమ్మకు పింఛన్ రాదా?
### మంచమ్మీద ఉన్నా రుజువు కావాలా?

ప్రజాశక్తి - బలిజిపేట

ఆమె పుట్టుకతోనే వికలాంగురాలు... రెండు కాళ్లు పనిచేయవు. ఒకరి సహాయం లేకపోతే ఆమె నిలబడలేదు, నడవలేదు, తన పని తాను చేసుకోలేదు. అసలు తన పెన్షన్ ఎందుకు ఆగిందో తనకే తెలియదు. ఎవరు ఆపారో, ఎందుకు ఆపేశారో తెలియక దిక్కు ముక్కు లేని పరిస్థితిలో ఉంది. ఇదీ మండలంలోని తుమరాడ గ్రామానికి చెందిన మడక రాధాకుమారి దీనస్థితి.

రాధాకుమారి వందశాతం వికలాంగురాలని తెలిసినా నేటికి మూడేళ్లు కావస్తుంది ఆమె పింఛనను నిలిపివేశారు. ఈ విషయమై స్థానిక పెద్దలు గానీ, మండల అధికారులు, నాయకులు గానీ, ఎమ్మెల్యే గాని గుర్తించి స్పందించక పోవడం, పింఛను పునరుద్దంచక పోవడంతో ఆమె పరిస్థితి కడుదయనీయంగా ఉంది. మూడేళ్లుగా ఎలా బతుకుతుందో... ఏం తింటుందో అర్థం కాని పరిస్థితి. ఇంతలా ఒక మహిళా వికలాంగురాలిని బాధ పెట్టడం రాజకీయ నాయకులకు, అధికారులకు తగదని స్థానికులు వాపోయారు. ఇలాంటి వారికి మానవత్వంతో పెన్షన్ అందజేసి తమ మానవత్వాన్ని నాయకులైనా, అధికారులైనా నిరూపించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా స్థానిక నాయకులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తనకు పింఛను పునరుద్ధరించాలని బాధితురాలైన రాధాకుమారి వేడుకుంటోంది.

# ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఎరువుల షాపులను స్థానిక తహశీల్దార్ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల డీలర్లకు పలు సూచనలు జారీ చేశారు. లైసెన్స్‌లు తప్పకుండా షాపుల్లో ప్రదర్శించాలని, ఆ ధీకృత కంపెనీల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలని, బిల్లు బుక్కులు, ఇన్‌వాయిస్‌లు, రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలని సూచించారు. యూరియా విక్రయించేటప్పుడు అధిక యూరియా వాడకం వల్ల కలిగే నష్టాలను నానో యూరియా ఉపయోగాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాచిపెంటలో గల కృష్ణ ఎరువుల డిపో, గోరా త్రినాధరావు, ఎరువులు డిపో, గురునాయుడుపేటలో గల బంగారమ్మ ఎరువుల డిపోను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నాగమణి పాల్గొన్నారు.

**కొమరాడ :** రైతులను మోసగించి అధిక ధరకు ఎరువులు అమ్మినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం కొమరాడలో గల మన గ్రోమోర్, మరో రెండు ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. స్టాక్ వివరాలు, అనుమతి పత్రాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన పురుగుల మందులు అమ్మినట్లయితే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పి ధరలకే ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం నిషేధించిన గడ్డి మందును ఎవరైనా అమ్మకాలు జరిగితే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ప్రతి ఏటవ ఎరువులు షాపుల వారు లైసెన్సులు తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

**వీరఘట్టం :** మండల కేంద్రంలోని గ్రోమోర్, జనతా రైతు డిపో, ఓం కాళీ కృష్ణ, భోగి శశిభూషణరావు, భోగి ఉమామహేశ్వరరావు, భోగి శ్రీధర్, శ్రీ సత్యనారాయణ ,శ్రీ వెంకటేశ్వర తదితర ఎరువుల దుకాణాలను తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు, వ్యవసాయ అధికారి జె.సౌజన్య, సిఐ వెంకట్‌రాజ్ తనిఖీలు చేపట్టారు. స్టాకు రికార్డుల పరిశీలనతో పాటు ఇ-పాస్ యంత్రాలు, గోదాముల్లో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. ధరల పట్టికపై స్టాకు వివరాలు రాయడంతో పాటు ధరలు కూడా పొందుపరచాలన్నారు. వీరితో పాటు వీఆర్వోలు వి.రమేష్, శ్రీను, రాజేంద్రప్రసాద్, ఎరువుల డిపో డీలర్లు ఉన్నారు.

**మక్కువ:** మండలంలో ఎరువుల దుకాణాలను తహశీల్దార్ భరత్ కుమార్, మండల వ్యవసాయ అధికారి సిహెచ్ భారత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రౌండ్ బ్యాలెన్స్, ఇ-పాస్ మిషన్ బ్యాలెన్స్, స్టాక్ బుక్ బిల్ బుక్స్ తనిఖీ చేశారు. అలాగే ఎరువుల దుకాణదారుల స్టాక్ బోర్డులో ఎరువులు లభ్యత ప్రదర్శించాలన్నారు. అలాగే రైతులకు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాల్సిందిగా ఎరువుల డీలర్లను ఆదేశించారు.


పాచిపెంటలో ఎరువులు దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు


వీరఘట్టంలో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

### ఎరువుల పర్యవేక్షణపై కలెక్టర్ సమీక్ష

**పార్వతీపురం :** జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. జిల్లాలో అవసరమైన పరిమాణంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కావున ఎరువుల కోసం ఎటువంటి ఆందోళన అవసరం లేదని, రైతులకు ఈ విషయాన్ని వివరించాలని చెప్పారు. ఎరువులు పంపిణీ పరిస్థితిని ఎప్పటికపుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు అధికారులు పర్యవేక్షించిన వివరాలను మండలాల వారీగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎరువుల పర్యవేక్షణపై జెసితో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువుల దుకాణాలపై పటిష్ట పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా కఠినచర్యలు తీసుకోవాలని, అవసరమైతే సీజ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.


మరుగుదొడ్డి లో ఉన్న కోబ్రా

## కింగ్ కోబ్రా హల్‌చల్

ప్రజాశక్తి -కురుపాం

కింగ్ కోబ్రా జాతికి చెందిన విష సర్పం మంగళవారం మండలంలో కిచ్చాడలోని ఓ మరుగుదొడ్డిలో చేరి గ్రామస్తులను భయాందోళనకు గురిచేసింది. సుమారు 12 అడుగులకు పైగా పొడవు ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు విశాఖపట్నం తూర్పు కనుముల వన్యప్రాణి సంరక్షణ సంస్థ సభ్యులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని కింగ్ కోబ్రాను (గిరినాగు) చాకచక్యంగా పట్టుకున్నారు. విష జాతికి చెందిన సర్పాల్లో ఈ జాతి సర్పాలు ప్రపంచంలోనే అతి పొడవైనవి. ఇవి మనుషులపై కన్నా ఎక్కువగా విష జాతికి చెందిన వేరే సర్పాలను ఆహారంగా తీసుకుంటాయన్నారు. అరుదైన ఇటువంటి గిరినాగులను సంరక్షించాలని, ఎక్కడైనా కనిపిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కురుపాం అటవీశాఖ రేంజ్ అధికారి గంగరాజు, తూర్పు కనుమల వన్యప్రాణి సంరక్షణ సంస్థ అధికారులు మూర్తి కంటి మహంతి, వి.కృష్ణ, ఎస్.మధు, ఫారెస్టు బీట్ అధికారి కె.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


**సీతంపేటలో పాముల కలకలం**

**సీతంపేట :** స్థానిక స్టేట్ బ్యాంకు వెనుక భాగాన కట్టల పాము, కింగుకోబ్రా అనుమానాంగా, మాదిరిగానే మరో పాము సంచరించాయి. ఒకేసారి రెండు పాములు సంచరించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో వీటిని హతమార్చారు. వర్షాకాలంలో విషసర్పాలు పొలాల గట్లపైన, గడ్డిల్లో దాగి ఉంటాయి. ఎక్కువగా తుప్పల్లో పరిశీలించాలని విశ్లేషకులు చెప్తున్నారు.

## ఉచిత ప్రయాణానికి 65 బస్సులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి డిపో పరిధిలో 65 బస్సులు సిద్ధం చేశామని స్థానిక ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎం. దుర్గ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి ప్రారంభించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి మంగళవారం స్థానిక ఆర్‌టిసి డిపోలో స్త్రీ శక్తి పథకానికి సంబంధించి జీరో టికెట్ కోసం కండక్టర్లకు టికెట్ ఇష్యూ విధానంపై అవగాహన కల్పించారు. పార్వతీపురం డిపోలో 65 బస్సుల్లో స్త్రీ శక్తి పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్లు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందవచ్చునని తెలిపారు. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, అంతర్ రాష్ట్ర సర్వీసులకు ఈ పథకం వర్తించదన్నారు. ఈ పథకం ద్వారా రోజుకు సుమారు 10 నుంచి 15వేల మంది మహిళలు లబ్ధిపొందుతారని ఒక అంచనా ఉందని, ఇందుకు సంబంధించి 65 బస్సుల కండిషన్‌ను మెరుగుపర్చినట్లు తెలిపారు. ఈ పథకం ప్రారంభానికి అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

## సిఎం సహాయ నిధి బాధితులకు అండ

ప్రజాశక్తి - కురుపాం

సిఎం సహాయ నిధి బాధితులకు అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. కురుపాం గ్రామానికి చెందిన బి.శివున్నాయుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో సిఎం సహాయ నిధి నుంచి రూ.48,079 మంజూరైంది. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బాధితులకు ఎమ్మెల్యే జగదీశ్వరి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కురుపాం మండల టిడిపి కన్వీనర్ కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పీసా చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సామరెల్లిలో మంగళవారం షెడ్యూల్ ప్రాంతాలు - షెడ్యూల్ ప్రాంతాల్లో పీసా చట్టం అమలుపై రిసోర్స్ పర్సన్ పల్లా తిరుపతిరావు అవగాహన కల్పించారు. షెడ్యూల్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి అవగాహన కల్పించాలన్నారు. పీసా పరిధిలో అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు షెడ్యూల్ ప్రాంతాలు - షెడ్యూల్ ప్రాంతాల్లో పీసా చట్టం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కొండపల్లి సత్యం, ఉప తహశీల్దార్ మల్లేశ్వరరావు, మండల జనసేన అధ్యక్షులు మొండంగి విశ్వనాథం, కార్యదర్శి వినోద్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## రంగనాథన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాల శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ దినోత్సవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీవరం మాట్లాడుతూ డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ గ్రంథాలయ శాస్త్రానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా భారతదేశంలో గ్రంథాలు అభివృద్ధి, నూతన గ్రంథాలయాలు ఏర్పాట్లయ్యాయన్నారు. ప్రతి కళాశాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేసుకోవడంలో ఆయన కృషి అమోఘమైనమన్నారు. లైబ్రేరియన్ డాక్టర్ జి.ప్రభాకర్ మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్రానికి పంచసూత్రాలను ప్రసాదించిన ఎస్ఆర్ రంగనాథన్ ఆదర్శనీయుడని అన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలోనూ ఈ పంచ సూత్రాల మీదే గ్రంథాలయాలు నడుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.కల్పన, ఎ.శ్రీవాణి, జె.స్వరూప, జి.తులసి, కృష్ణారావు ఉన్నారు.



ప్రభుత్వ వైఫల్యాలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

## గుమ్మిడిలో బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గుమ్మడి పంచాయతీ గాటి, గుమ్మడ తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం తీరును ఎండగట్టారు. సూపర్ సిక్స్ ఎక్కడా అమలు కాలేదని వివరిస్తూ... తల్లికి వందనం పథకం అనేక మందికి వర్తించలేదని, గ్యాస్ సగం కూడా జమ కాలేదని తెలిపారు. అన్నదాత సుఖీభవ సగం కొందరికేనని దుయ్యబట్టారు. సంక్షేమం కేవలం వైసిపితో సాధ్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు వెంకినాయుడు, జడ్పిటిసి ప్రతినిధి రాము, జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ మోహన్‌రావు, పాలకొండ నియోజకవర్గ వైసిపి ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టు అప్రజాస్వామికం

ప్రజాశక్తి.. పార్వతీపురం టౌన్

ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, విపక్ష ఎంపిలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పార్వతీపురం నియోజకవర్గం పార్వతీపురం ఇంచార్జ్ బత్తిని మోహన్ రావు అన్నారు. కాంగ్రెస్ నాయకులు వంగల దాలి నాయుడు, సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, తీళ్ళ గౌరి శంకరరావు, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో అతి విలువైన ఓటు చోరీకి గురైందని నిరసిస్తూ ఢిల్లీలో ఇసి కార్యాలయానికి వెళుతున్న కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేతో పాటు పలువుర్ని అరెస్టు చేయటం అప్రజాస్వామ్యం అని, ఆయా అరెస్టులను తాము ఖండిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ అరెస్టుతో ఓటు చోరీ జరిగిందని ప్రజలందరికీ తెలిసిందన్నారు. తమ అధినేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం రాజకీయ పోరాటం కాదని, ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి లభించిన ఓటు హక్కును కాపాడే పోరాటమని అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు చోరీకి గురి అయిందని ఓటు చోర్ పై రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం ప్రశంసనీయమన్నారు.

## రైతులకు సేవ చేస్తాం : పిఎసిఎస్ చైర్మన్లు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పి, తామరకండి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల అధ్యక్షులుగా నియమతులైన చొంగల సింహాచలం, యమల శ్రీరామలునాయుడు, డైరెక్టర్లు భోగి అప్పలనాయుడు, వెన్నెల శంకర్రావు, అంటిపేట పిఎసిఎస్ చైర్మన్ ఎగిరెడ్డి భాస్కరనాయుడు తదితరులు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా ఎంపికైన పిఎసిఎస్ చైర్మన్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో తమకు పదవులు వచ్చాయని, వాటిని రైతుల కోసం ఉపయోగించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామని స్పష్టం చేశారు. పిఎసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లుగా ఎంపికైన నాయకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు మంచి సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ తెలుగుదేశం నాయకులు గొట్టాపు అప్పారావు, బి.సత్యనారాయణ, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, ఆర్ వేణుగోపాలనాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

చేతులను సబ్బుతో శుభ్రపర్చుకొని ఆహారాన్ని తీసుకోవడం వల్ల నులిపురుగుల నుంచి రక్షణ పొందవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆహార పదార్థాలు తీసుకునే ముందు, ఆ తరువాత శుభ్రపర్చుకోవడం అలవాటుగా మారాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమం స్థానిక డివిఎం పాఠశాలలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ వల్ల రక్తహీనత, పోషక లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ప్రబలుతాయన్నారు. అందుకే వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పక తీసుకోవాలని అన్నారు. డీ-వార్మింగ్ డే సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను కలెక్టర్ విద్యార్థులతో నమిలి మింగించారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వరకు పిల్లలు, విద్యార్థులు వీటిని తప్పక తీసుకోవాలని అన్నారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని, ఈ రోజు వేయబడని వారికి ఈనెల 20న మాప్‌అప్ కార్యక్రమంలో మాత్రలు వేయాలని ఆదేశించారు. రక్తహీనతగా గుర్తించిన కిశోర బాలికలకు ప్రతీ రోజూ ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలని కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఆర్‌బిఎస్‌కె పిఒ డాక్టర్ టి.జగన్మోహన రావు, డిఇఒ బి.రాజ్‌కుమార్, స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్ కె.కిరణ్‌నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రఘు, డాక్టర్ వినోద్, డాక్టర్ కౌశిక్, వైద్యాధికారి డాక్టర్ లావణ్య, హెచ్‌ఎం శ్రీధర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**సీతంపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులు పురుగుల నిర్మూలన కార్యక్రమం కాలేజీ ప్రిన్సిపాల్ సుశాంత్ జన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం తర్వాత ఆల్బెండ్‌జోన్ మాత్రలు వేసుకోవాలని సూచించారు . కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు అధ్యాపకులు శంకరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

**సీతానగరం :** విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను వాడాలని సీతానగరం, పెదంకలాం పిహెచ్‌సి వైద్యాధికారులు ఉషారాణి, పి.రమ్యసాయి అన్నారు. నేషనల్ డీ వార్మింగ్ డే సందర్భంగా పలు పాఠశాలలను సందర్శించి ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. సీతానగరం పిహెచ్‌సి పరిధిలో 4,400 మంది విద్యారులు, అంగన్వాడీ పిల్లలు ఉన్నారని, వీరిందకీ మాత్రలు మింగిస్తామన్నారు. అలాగే పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 1397 మంది ఉండగా, 1340 మందికి వేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.సూర్యదేవుడు. సీతానగరం పిహెచ్‌సి యుడిసి మురళి, సిహెచ్‌ఒ రమణ, సీతానగరం, బూర్జ జెడ్పీ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఇల్లా ప్రసన్నలక్ష్మి, రామకృష్ణ, సూపర్వైజర్ వరలక్ష్మి, ఇఒ జి.సూర్యనారాయణ, ఎఎన్‌ఎంలు, ఆశాలు, ఎంఎల్ఎన్‌హెచ్ఒ తదితరులు పాల్గున్నారు.

**బలిజిపేట :** నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో పిల్లలకు ఆల్బెండ్‌జోల్ మాత్రలను వైద్య అధికారులు డాక్టర్ క్రాంతి కిరణ్మయి, డాక్టర్ మాధురి, ఎంఇఒ ఎస్.సింహాచలం ఆధ్వర్యంలో మింగించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణమై మాట్లాడుతూ పిల్లలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ వైద్యుల సలహాలు పాటిస్తూ పిల్లలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

**వీరఘట్టం:** మండలంలో డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్‌సి పరిధిలోని 5586మంది పిల్లలకు గానూ 5200 మందికి నులు పురుగు మాత్రలు వేసినట్టు వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. అలాగే బిటివాడ పిహెచ్‌సి పరిధిలోని 2957 మంది పిల్లలకు గానూ 2682 మంది పిల్లలకు మాత్రలు వేసినట్టు వైద్యాధికారి ఎ.మానస తెలిపారు.



సీతానగరంలో విద్యార్థులకు అల్బెండ్‌జోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి



పార్వతీపురంలో విద్యార్థులకు అల్బెండ్‌జోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**కొమరాడ :** జాతీయ నులిపురుగుల నిర్మూల కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జనార్థం అన్నారు. మండలంలోని కొమరాడ, విక్రాంపురంలో గల ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, వసతి గృహాల్లో జరిగిన డీవార్మింగ్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఎపిటిడబ్ల్యుఆర్ఎస్ బాలుర హాస్టల్‌లో పురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రారంభించి విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసి మింగించారు. కార్యక్రమంలో కొమరాడ వైద్యాధికారి అరుణ్ కుమార్ వైద్య సిబ్బంది ఉన్నారు.

**కురుపాం :** జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలో మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి బి.ప్రజ్ఞ లంకజోడు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. అనంతరం పిల్లల్లో రక్తహీనత, పోషకాహారం లోపం తదితర ఆరోగ్య సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**భామిని :** నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి అన్నారు. మండలంలోని బాలేరు, భామిని, బత్తిలి పిహెచ్సి పరిధిలోని వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలైన ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. బత్తిలి పిహెచ్‌సి పరిధిలో 1519 మంది పిల్లలకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేసినట్టు బత్తిలి వైద్యులు కొండపల్లి రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పసుపులేటి సోయల్, సంతోషలక్ష్మి, కొండ్రు దామోదర్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## లక్షాధికారులుగా తీర్చిదిద్దాలి : పీడీ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎం.సుధారాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళా పారిశ్రామికవేత్త రావాలనది రాష్ట్ర ముఖ్యమంత్రి సంకల్పమని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మైక్రో క్రెడిట్ ప్లాన్ అమలుపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సమన్వయ సమావేశం పీడీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా తయారు చేసిన ప్రణాళికల మేరకు మహిళలకు రుణాలు మంజూరు చేయాలని అన్నారు. ఒక్కో మహిళా సభ్యురాలికి లక్షరూపాయలు చొప్పున రుణాలు మంజూరుచేసి, వ్యాపారవేత్తలుగా చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా డిజిటల్ ఎంసిపి ( మైక్రో క్రెడిట్ ప్లాన్) ఆన్ లైన్ ద్వారా రుణాలు మంజూరు చేయడం దీని ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. బ్యాంకు లింకేజీలను సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. అందుకు తగిన విధంగా అధికారులు బ్యాంకర్లను సమన్వయం చేసుకొని మహిళా సభ్యులకు సకాలంలో రుణాలను మంజూరు చేయాలని ఆమె వివరించారు. సమావేశంలో ఎల్‌డిఎం ఎన్.విజయ్ స్వరూప్, బ్యాంకు కంట్రోలర్స్, డిపిఎంలు, బ్యాంకు మేనేజర్లు, ఎపిఎంలు పాల్గొన్నారు.





ఫ్రెషర్స్‌డేలో మాట్లాడుతున్న ఎఎస్‌పి అంకిత సురానా

## ఘనంగా వేదాంత ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి-పార్వతీపురం

స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెసర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో జూనియర్ ఇంటర్ విద్యార్థులను సీనియర్ ఇంటర్ విద్యార్థులు క్యాంపస్‌లోకి స్వాగతించారు. ఈ కార్యక్రమాన్ని ఎఎస్‌పి అంకితా సురానా జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అమ్మాయిలు తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకోవాలని, అది ఏ రంగమైనా సాధించేందుకు ఎదురైన ప్రతి సవాల్‌ను ఛాలెంజ్‌గా తీసుకోవాలని అన్నారు. విద్యార్థి దశలోనే నేటి తరం యువత చదువుపై దృష్టి పెట్టాలన్నారు. ఏ రంగంలో రాణించాలనుకుంటున్నారో గట్టిగా నిర్ణయించుకుని ఇతర విషయాలు జోలికి వెళ్లకుండా భవిష్యత్తు కోసం ఆలోచిస్తూ దాని సాధన దిశగా సాగిపోవాలన్నారు. శక్తి యాప్, సేఫ్టీ యాప్ మహిళల వద్ద తప్పక ఉండాల్సిందేనని నొక్కి చెప్పారు. ఈ వేడుకలకు వేదోత్సవ్ -3.0 అని నామకరణ చేసి వినూత్నంగా ప్రెస్స్ డే కార్యక్రమాన్ని జరిపారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు విశ్లేషించి, ఉత్తేజపరిచేలా విద్యార్థులతోనే జవాబులు చెప్పించారు. ఐఐటి - జెఇఇలో ర్యాంకు సాధించిన శ్రీ చందన్, ఎంసెట్‌లో ర్యాంకు సాధించిన పి.జస్వంత్, అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో ర్యాంక్ సాధించిన ఓలేటి నవ్యశ్రీ , డైరెక్ట్ క్లాస్ రూమ్ స్టూడెంట్ ఏలూరు సాయిలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులను, ఎఎస్‌పికి వేదాంత జూనియర్ కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో చీఫ్ మెంటర్ డాక్టర్ పెంట అప్పారావు, డైరెక్టర్ ఎస్ఎల్ నాయుడు, డీన్ పివి రమణబాబు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ లోకేష్, ఇతర ఫ్యాకల్టీ, పూర్వ విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు పోరాటాలు చేయాలని ఎఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి బిటి నాయుడు, ప్రస్తుత జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలోని పలు కాలేజీల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి జెండా ఆవిష్కరణ చేసిన ఎఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి బిటి నాయడు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం నా జన్మ హక్కును ఈ దేశాన్ని పాలిస్తున్న బ్రిటీష్ తెల్లదొరలను తరిమికొట్టడానికి ఆవిర్భవించిన సంఘం ఎఐఎస్ఎఫ్ అని కొనియాడారు. విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లోకి విద్యార్థి నాయకులు, రాజకీయ పార్టీలు అనుమతులేదని తీసుకొచ్చిన జీవోలు ఎవరికోసం ఎవరి లబ్ది కోసమని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని కోరారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యను కాషాయకరణ చేయడానికి ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన వారి చరిత్రను చెరిపివేసి దేశం కోసం బ్రిటీష్ వారికి తొత్తుగా పనిచేసిన వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడాన్ని తప్పుపట్టారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారని, ఆ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకంలో అనేక షరతులు పెట్టడంతో అనేక మంది విద్యార్థులకు అందలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ బిసి, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నేటికీ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. యువగళం పాదయాత్రలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వికాస్, చరణ్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## యు.వెంకంపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి సచివాలయం పరిధి యు.వెంకంపేటలో మంగళవారం స్థానిక వైద్యాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర స్త్రీ శిశు, గిరిజనసంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. రైతులకు పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా మొదటి విడత ఒక్కొక్క రైతుకు రూ.7వేలు రైతుల ఖాతాల్లోకి జమ అయిన సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞత తెలిపడానికి ట్రాక్టర్లతో రైతుల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బోసుబొమ్మ మీదుగా ఎఎంసి వరకు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రైతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ ప్రతి రైతుకు అవసరమైన అన్ని రకాల పథకాలను, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను, అన్నదాత సుఖీభవ కింద నగదు, సబ్సిడీతో ఎరువులను, డ్రిప్ ఇరిగేసిన సంబంధించిన సామాన్లు అందజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు పండించిన పంటలకు మార్కెట్ ధరలను అందజేస్తూ, పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానినిక కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌పి భంజ్ దేవ్, సాలూరు పట్టణ, మండల మక్కువ పాచిపెంట మండలాల అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, గుళ్ల వేణుగోపాలరావు, యుగంధర్, నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన రైతులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సాలూరు పట్టణంలో ట్రాక్టర్ ర్యాలీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

# రసాయనాలను వినియోగించొద్దు : డిపిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మానవ జీవనానికి, తన మనుగడకు కారణమైన ప్రకృతిని కాపాడుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ అధికారి ఎం.శ్రావణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎడిఎ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ అధికారి ఎం. శ్రావణ్‌కుమార్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి.పారినాయుడు, సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో డివిజనల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి అయోగ్ మన్యం జిల్లాను ప్రకృతి వ్యవసాయ ఆశాజనక జిల్లాగా ఎంపిక చేయడం గర్వకారణంగా ఉందని, ఇందుకు ప్రతి ప్రకృతి వ్యవసాయ కార్యకర్త రైతులకు అందుబాటులో ఉంటూ వారు ప్రకృతికి హాని చేసే విష పదార్థాలు ఉపయోగించకుండా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సహజ పంటలు పండించుకుని ప్రకృతిని, భూమాతను, సకల జీవరాశులను, అందరి ఆరోగ్యాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. మక్కువ, సాలూరు, పాచిపెంట మండలాల్లో కొన్ని గిరిజన గ్రామాలను మోడల్ గ్రామాలుగా ఎంపిక చేశామన్నారు. అదేవిధంగా జిల్లాలో అధిక గ్రామాలను బయో గ్రామాలుగా మార్చడానికి ప్రణాళికలు తయారు చేసి అందరి సహకారంతో ఆచరించేందుకు ప్రయతిస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ పారినాయుడు మాట్లాడుతూ 2018లో కురుపాం మండలం కొండ బారిడిలో 72 మంది రైతులు 262 ఎకరాల్లో ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడకుండా సహజంగా లభించే వనరులను, నవధాన్యాలను, జీవామృతాలను ఉపయోగించుకొని సాగు చేశారన్నారు. అలాగే ఈ ఏడాది సాలూరు డివిజన్ పరిధిలో కొన్ని గ్రామాలను బయో గ్రామాలుగా బలోపేతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ దేవీప్రసాద్, మాస్టర్ ట్రైనర్ పి.యశోదమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూరిబాబు, కుమారి, పార్వతీ, మాధవి, రంగా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిపిఎం శ్రావణ్‌కుమార్‌నాయుడు, పారినాయుడు

# ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి జట్టు సంస్థ నూతన కార్యాలయ ప్రాంగణంలో విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాలకు చెందిన 40 మంది బయో రిసోర్స్ కేంద్రాల యజమానులు, రైతులకు వివిధ రకాలు కాషాయాలు, ద్రావణాల తయారీ, ఉపయోగాల గురించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ పంటలకు పురుగులు, తెగుళ్లు సోకిన తర్వాత కషాయాలు పిచికారీ చేస్తే ఎక్కువ ప్రయోజనం కలగదన్నారు. ముందు జాగ్రత్తగా నీమాస్త్రాం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం మొదలగు కషాయాలు తయారు చేసుకొని పిచికారీ చేయడం వల్ల అధిక ప్రయోజనం, అధిక దిగుబడులు సాధించడానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. కాయ, కాండం తొలుచు పురుగులు, పెద్దపెద్ద పురుగులు, రసం పీల్చే పురుగులు, నివారించడానికి ఈ కసాయాలు ఉపయోగపడతాయన్నారు. పర్యావరణానికి, పిచికారీ చేసిన వ్యక్తులకు, భూమికి, పంటలకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. బయో రిసోర్స్ కేంద్రాల్లో అన్ని రకాల కషాయాలు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కషాయాల వల్ల మిత్ర పురుగులకు నష్టం లేకుండా, శత్రు పురుగులు నివారణకు చక్కగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కన్సల్టెటెంట్లు రమాప్రభ, ప్రవీణ్, ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, మాస్టర్ ట్రైనర్ బి.శ్రీరామ్, ట్రైనర్లు సిహెచ్ రవి కుమార్, శంకరావు, పాపారావు, బయో రీసోర్స్ కేంద్రాలు యజమానులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కురుపాం ఎస్సై పి.నారాయణ రావు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకుండా సైబర్ క్రైమ్ నేరాల బారిన పడి మోసపోకుండా విద్యార్థి దశ నుంచే సక్రమంగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. అనంతరం మండల కేంద్రానికి సమీపాన గల పూతిక వలస జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు లేని వాహన దారులకు అపరాధ రుసుం వేసి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.

**సీతంపేట :** మండలంలో ఎన్టీయార్ పార్క్ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై ఎస్సై వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్ స్పీడ్‌తో వెళ్లకూడదని సూచించారు. హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వాహనాలకు ధ్రువపత్రాలకు సంబంధించిన తప్పనిసరిగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

**వీరఘట్టం :** మండలంలోని మరియగిరి ఆలయం వద్ద స్థానిక ఎస్సై జి.కళాధర్ ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్‌లో అందుబాటులో ఉంచుకోవాలని, వాహనదారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



కురుపాంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నారాయణరావు